క్లుప్తంగా

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత



రమణమ్మ వేలిముద్రను సేకరిస్తున్న వలంటీర్ నరేష్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దేవుని నెలివాడ గ్రామానికి చెందిన వృద్ధురాలు మామిడి రమణమ్మ కొన్ని రోజులుగా పేగు సంబంధిత వ్యాధితో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఇటీవల డిశ్చార్జ్ అయింది. తరచూ ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో కేజీహెచ్ సమీపంలోనే తన కుమార్తె ఇంటి వద్ద ఉంటూ చికిత్స తీసుకుంటోంది. అక్కడి నుంచి స్వగ్రామానికి రావడం ఇబ్బందికరంగా ఉండడంతో సమాచారం తెలుసుకున్న వలంటీర్ దంతినాడ నరేష్ బుధవారం సుమారు 71 కిలోమీటర్లు ప్రయాణం చేసి రమణమ్మకు పింఛన్ సొమ్ము అందజేశాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రూరల్: మండల పరిధిలోని 9 గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఆపరేషన్ ఈఈ ఎన్.కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యన్నపేట 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో మండలంలోని దుప్పాడ, జొన్నవలస, చిల్లపేట, సారిక, గుండాలపేట, కోరుకొండ, కోరుకొండపాలెం, పినవేమలి, రాకోడు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

దత్తిరాజేరు: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కె.కొత్తవలస పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ గిరిబాబు, వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని మరడాం గ్రామంలో ప్రజలకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఇంటి ముందు పశువుల గోశాలు, చెత్త కుండీలు, కొబ్బరి బొండాల చిప్పలు, చెత్తాచెదారం ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు. దోమల వల్లే డెంగ్యూ, మలేరియా, తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. వేడి ఆహార పదార్థాలను, కాచిన నీటిని తీసుకోవాలని సూచించారు.

సకాలంలో టీకాలు వేయాలి



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్

జామి: గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో, శతశాతం టీకాలు వేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నారులకు వైద్య సిబ్బంది బుధవారం టీకాల వేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఆయన వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. టీకాకు టీకాకు మధ్య కచ్చితమైన వ్యవధి పాటించాలన్నారు. బిడ్డకు తల్లి పాలు ఇవ్వాల్సిన ఆవశ్యకతను, తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. ఏఎన్‌ఎం పి.లక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



చెక్ అందజేస్తున్న వంశీకృష్ణ

చీపురుపల్లి: మండలంలోని సంకుపాలెం గ్రామానికి చెందిన ఎం.శ్రీదేవికి ప్రధానమంత్రి సహాయ నిధి పథకం ద్వారా రూ.3 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్‌ను ఎంపీ బెల్లాన చంద్ర శేఖర్ కుమారుడు వంశీకృష్ణ పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో శ్రీదేవి కుటుంబ సభ్యుడు రమణకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీదేవి అనారోగ్యం కారణంగా కుటుంబ సభ్యులు, గ్రామపెద్దల విజ్ఞప్తి మేరకు సహాయం కోసం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేశారని చెప్పారు. ఈ మేరకు ప్రధాన మంత్రి సహాయ నిధి పథకం నుంచి రూ.3 లక్షల మంజూరయ్యాని తెలిపారు. కార్యక్రమంలో కొసిరెడ్డి రమణ, డి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

జామి: మండలంలోని తాండ్రంగిలో గ్రామసచివాలయ భవనం, వి.ఆర్.పాలెంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రాల భవనాలను గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గురువారం ప్రారంభించనున్నారని ఎంపీడీఓ సతీష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- పూర్తయిన పనులను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



44వ డివిజన్‌లో పూర్తి చేసిన రోడ్డును ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్తయిన పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఆయా డివిజన్ల ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నిరంతర పర్యటనలు చేస్తూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో నగరంలోని 44వ డివిజన్ సుందరయ్య కాలనీ, చెంచుల కాలనీలలో నిర్మించిన సీసీ రహదారులు, కల్వర్టులను బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎస్‌కే డిగ్రీ కాలేజ్ సమీపంలో సీసీ రహదారికి శంకుస్థాపన చేశారు. రూ.48.10 లక్షలతో చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం కావడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ముందుగా స్థానిక ప్రజలు డిప్యూటీ స్పీకర్‌కు ఘనంగా స్వాగతం పలికి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ప్రారంభోత్సవాల అనంతరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన ప్రజావసరాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా సుందరయ్య కాలనీ, చెంచుల కాలనీలలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రహదారి సమస్యకు మోక్షం కలిగించారన్నారు. అంతేకాకుండా నగరంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. నగర సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల అన్ని ప్రధాన కూడళ్లు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయని తెలిపారు. ఒకవైపు సంక్షేమ పథకాలు.. మరోవైపు నగర అభివృద్ధితో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు అయిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సైలాడ సత్యానారాయణ మాట్లాడుతూ, తమ డివిజన్ అభివృద్ధిపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక శ్రద్ధ చూపడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, కార్పొరేటర్లు సైలాడ ఈశ్వరమ్మ, బొద్దూరు గోవిందమ్మ, జోనల్ ఇన్‌చార్జ్ తమ్ము, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, సూరిబాబు, బొద్దూరు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు ఆపాలి..



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు

పూసపాటిరేగ: మైలాన్ కాంట్రాక్ట్ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని సీఐటీయూ నాయకుడు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని గైతులచోడవరం మైలాన్ పరిశ్రమ గేటు ఎదురుగా కార్మికులతో కలిసి బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైలాన్ పరిశ్రమలో ఎంబీ -11లో వెల్ సెట్రన్ అనే కెమికల్ వల్ల కార్మికులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ బ్లాక్‌లో పనిచేస్తున్న కొంతమంది కార్మికులను వేరే బ్లాక్‌లకు మార్చి.. కొంతమంది కార్మికులను మాత్రం అక్కడ నుంచి మార్పు చేయకుండా యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి యాజమాన్యం హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో కె. నారంనాయుడు, ఎం. సూరిబాబు, పతివాడ శ్రీను, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాలకృష్ణ, ఎస్సై

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా గేదెల బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎ. నరేష్ విజయనగరం స్పెషల్‌బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై బాలకృష్ణ మాట్లాడుతూ, శాంతిభద్రతలు పరిరక్షణ, రహదారి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

పరిహారం పెంచేలా చూడండి

వేపాడ: సోంపురం-ఆనందపురం రహదారి విస్తరణలో భూమిని కోల్పోయిన తనకు ప్రస్తుతం ఇచ్చిన పరిహారాన్ని పెంచేలా చూడాలని ఆతవ గ్రామానికి చెందిన రైతు నెక్కల అమ్మన్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును కోరారు. ఆతవ గ్రామానికి బుధవారం వచ్చిన ఎమ్మెల్సీని రైతు అమ్మన్న కలిసి తన సమస్య వివరించారు. రోడ్డు విస్తరణలో 30 సెంట్ల భూమి కోల్పోయానని, అర్అండ్‌బీ వారు లక్షరూపాయలే పరిహారం ఇచ్చారని రైతు వాపోయారు. తగిన న్యాయం చేయాలని రైతు కోరారు. దీంతో రోడ్డు విస్తరణలో రైతు కోల్పోయిన భూమిని ఎమ్మెల్సీ పరిశీలించారు. ఆర్డీఓతో మాట్లాడి పరిహారం పెంచే విషయం మాట్లాడతానని తెలిపారు. ఎమ్మెల్సీ వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఆరోగ్య సహాయకులు సత్యారావు

కొత్తవలస: రోజూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రోగాల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వియ్యంపేట పీహెచ్‌సీ ఆరోగ్య సహాయకులు సత్యారావు తెలిపారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి ఉత్తరాపల్లి క్లస్టర్‌లోని గాంధీనగర్, చిన్నిపాలెం, రాయపురాజుపేట, అప్పన్నపాలెం, నిమ్మలపాలెం గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు గర్భిణులు, బాలింతలకు ఉత్తరాల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ఆవశ్యకతపై బుధవారం అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు,రాగి మాల్ట్ వంటి ఆహార పదార్థాలు తీసుకుంటే రక్తహీనత సమస్య తలెత్తదన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగించుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎం వై.తులసీలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

10న 'వేడుకోలు నిరాహార దీక్ష'



వాల్‌పోస్టర్లను ఆవిష్కస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: సమగ్ర శిక్ష, కేజీబీవీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల పదో తేదీ ఉదయం పది గంటలకు కలెక్టరేట్‌వద్ద 'వేడుకోలు నిరాహార దీక్ష' కార్యక్రమం చేపట్టనున్నట్లు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ జిల్లా చైర్మన్ బి. కాంతారావు తెలిపారు. బుధవారం స్థానిక కేఎల్‌పురంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం నిరాహారదీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె. గురువులు, లక్ష్మణరావు, కె. పార్వతి, కృష్ణంనాయుడు, ఎర్నాయుడు, అప్పారావు, పైడిరాజు, లీలారాణి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధులకు వెలుగునిద్దాం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు, కళాశాల సిబ్బంది

కొత్తవలస: మరణానంతరం నేత్రదానం చేసి అంధులకు కంటి చూపును ప్రసాదించి వారిజీవితాల్లో వెలుగులు నింపుదామని విశాఖపట్నానికి చెందిన మోసిషన్ కంటి ఆస్పత్రి వైద్యులు అభిజిత్, కాత్యాయని అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని వాగ్దేవి కళాశాలలో విద్యార్థులకు నేత్రదానంపై బుధవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకరు నేత్రదానం చేస్తే ఇద్దరికి చూపు వచ్చే అవకాశం ఉందన్నారు. మరణానంతరం నేత్రాలు మట్టిలో కలిసిపోకుండా దానం చేయాలని సూచించారు. అనంతరం కొత్తవలస ప్రాంతంలో 150 కార్నియాలు సేకరణకు కృషి చేసిన విన్నకోటి రాజేష్‌ను వైద్యులు సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు టి.సుబ్బారావు, వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ కుమార్‌బాబు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు చెరుకూరి నాగరాజు, పూసర్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు అర్హులకు పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకునేందుకే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ నౌడు అరుణ, ఇతర నాయకులు, సచివాలయ సిబ్బంది ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. వర్షంలోనూ ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తూ, సమస్యలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేద,బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందిస్తున్నామని చెప్పారు. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు తలుపుతట్టి అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు మంజూరు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ సానుభూతిపరులు, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చిన వారికే పథకాలు అందేవని గుర్తు చేశారు. గ్రామాల్లో తక్షణం పరిష్కరించాల్సిన సమస్యల కోసం ప్రతీ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేస్తోందని వివరించారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించా లని ప్రజలను కోరారు. ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు,జేసీఎస్ కన్వీనర్ శ్రీను,ఎంపీటీసీ సత్యనారాయణ, స్థానిక నాయకులు నౌడు శ్రీను,టి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



వర్షంలో నాయకులతో కలిసి ఇంటింటికీ వెళుతున్న ఎమ్మెల్యే కడుబండి

• గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ..



నెల్లిమర్ల: రామతీర్థం జంక్షన్‌లో శ్రీకృష్ణుని విగ్రహం ఊరేగిస్తున్న భక్తులు

తల్లులకు బాలకృష్ణుడిగా.. చిన్నారులకు చిలిపి కృష్ణుడిగా.. స్త్రీలకు గోపికా వల్లభుడిగా.. పెద్దలకు గీతాకారుడిగా... ఇలా ప్రతి ఒక్కరి మదిలో ఏదో ఒక రూపాన కొలువైన శ్రీకృష్ణ జన్మదినాన్ని వాడవాడలా బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు వేకువ జామునే లేచి ఇళ్లకు మామిడి తోరణాలు కట్టి.. బాలకృష్ణుడికి ఆహ్వానం పలుకుతూ పాదముద్రికలు వేశారు. అలాగే తమ చిన్నారులను బాలకృష్ణుడి వేషధారణలో అలంకరించారు. గ్రామాల్లో సాయంత్రం నిర్వహించిన ఉట్టికొట్టే సంబరాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. – విజయనగరం/ నెల్లిమర్ల నెట్‌వర్క్



డెంకాడ: పినతాడివాడలో చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారి



విజయనగరం టౌన్: గురజాడ కళాభారతిలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలకు హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

9న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాణి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సత్యాజీ

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు వినియోగించు కోవాలని ఆ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయసేవా కమిటీ చైర్‌పర్సన్ సబ్బవరపు వాణి కోరారు. ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు సత్యాజీతో కలిసి బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీయే రాజమార్గమని, ఆవేశంలో కేసులు పెట్టుకుని, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని , డబ్బుని వృథా చేసుకోవడం సరికాదన్నారు. మాట్లాడుకోవడం ద్వారా పరిష్కారం అయ్యే వాజ్యాలను న్యాయవాదులు, పోలీస్ తదితర శాఖల అధికారులు లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. లోక్‌అదాలత్‌లో ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్ వంటి కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. న్యాయవాదులు, ఆయా శాఖల అధికారులు, బ్యాంకర్లు, కక్షిదారులు లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అభినందన

శృంగవరపుకోట: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మండలంలోని బొడ్డవర గ్రామంలోని తన నివాసంలో బుధవారం అభినందించారు. గత నెలలో విజయనగరం వద్ద పడాలపేటలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి చాంపియన్‌షిప్ కమ్ సెలక్షన్స్‌లో ఎస్.కోట పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-11 విభాగంలో ఎం.రాకేష్, అండర్-13 విభాగంలో మహ్మద్ నిషాద్ ఫాతిమా, మోపాడ జాన్సన్ సింగిల్స్, డబుల్స్‌లో ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చీఫ్ కోచ్ పి.శ్రీరాములు తెలిపారు.

గిరిజన ద్రోహి దారునాయక్

- టీఎస్ఎఫ్, టీపీఎస్ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్ గిరిజన ద్రోహి అని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, టీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణునాయక్ ధ్వజమెత్తారు. పట్టణంలో స్థానిక విలేకరులతో వారు బుధవారం మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అవినీతికి పాల్పడ్డారంటూ దారునాయక్ ఇటీవల చేసిన ఆరోపణలను వారు ఖండించారు. నిజాయితీకి మారుపేరుగా, గిరిజనులకు ఆరాధ్య దైవంగా ఎదిగిన రాజన్నదొరపై నిరాధార ఆరోపణలు చేసిన దారునాయక్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గిరిజన అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా ముందుకు తీసుకుపోవడంలో కీలక పాత్ర పోషిస్తున్న రాజన్నదొరను నైతికంగా దెబ్బతీయాలనే కుట్ర పూరితమైన ఆలోచనతోనే టీడీపీ నేతలు ఇటువంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాల అభివృద్ధి చెందేందుకు అనునిత్యం పరితపిస్తున్న గొప్ప వ్యక్తి రాజన్నదొర అని పేర్కొన్నారు. దారునాయక్ ఎందరో గిరిజనులను మోసం చేశారని ఆరోపించారు. వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని దారునాయక్ తన స్థాయిని మరచి ఉప ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేయడం సహించబోమని హెచ్చరించారు. తక్షణమే రాజన్నదొరకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. టీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి భగవాన్, టీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్‌నాయక్ ఉన్నారు.

నేత్రవైద్య శిబిరం

వేపాడ: వైఎస్సార్ కంటివెలుగు పథకంలో భాగంగా స్థానిక పాల సేకరణ కేంద్రం వద్ద శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నేత్రవైద్య శిబి రం నిర్వహించారు. ఆప్తాలమిక్ సత్యవతి 70 మందికి నేత్రపరీక్షలు చేసి 35 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారని శిబిరం కో-ఆర్డినేటర్ జోగారావు తెలిపారు. వీరికి ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నామని చెప్పారు.